క్లుప్తంగా

రైతులూ.. అప్రమత్తం

కాజులూరు: బంగాళాఖాతంలో ఏర్పడిన తుపాను ప్రభావంపై రైతులు, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని మండల వ్యవసాయాధికారి వి.అశోక్ అన్నారు. శుక్రవారం మండలంలో పలు గ్రామాల్లో ఏఓ, ఇతర అధికారులు పర్యటించి రైతులకు పలు సూచనలు చేశారు. గొల్లపాలెం ఆర్బీకేలో వీఏఏ వనుం రమ్య అధ్యక్షతన సభ జరిగింది. నైరుతి బంగాళాఖాతంలో ఏర్పడ్డ అల్పపీడనం తుపానుగా మారే అవకాశం ఉందని, తద్వారా జిల్లాలో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని అశోక్ తెలిపారు. మాసూళ్ల దశలో ఉన్న పంటను రక్షించుకునేందుకు రైతులు ముందస్తు చర్యలు చేపట్టాలన్నారు. వీలైనంత వరకూ పంటకోతలు వాయిదా వేసుకోవాలని, ధాన్యాన్ని సురక్షిత ప్రాంతాల్లో భద్రపరచుకోవాలన్నారు. వీలుకాని పక్షంలో ధాన్యాన్ని కళ్లాల్లో రాసులుగా పోసి, గడ్డి, బరకాలు కప్పుకోవాలని సూచించారు.

ధాన్యాన్ని సురక్షితం చేయాలి

రాయవరం: వాతావరణ శాఖ తుపాను హెచ్చరికల నేపథ్యంలో రైతులు పొలాల్లో ఉన్న ధాన్యాన్ని సురక్షిత ప్రాంతాలకు తరలించాలని ఏఓ కొప్పిశెట్టి ప్రభాకర్ రైతులకు సూచించారు. రాయవరంలో శుక్రవారం విలేకరులతో మాట్లాడుతూ ఈ నెల 3, 4, 5 తేదీల్లో భారీ నుంచి అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ హెచ్చరికలు జారీ చేసిందన్నారు. ఈ నేపథ్యంలో ధాన్యాన్ని బరకాలతో కప్పి తడవకుండా చూసుకోవాలన్నారు. కోయని వరి పంటకు కోతలు వాయిదా వేసుకోవాలన్నారు.

ల్యాబ్ టెక్నీషియన్‌కు ఉత్తమ సేవా పురస్కారం



జిల్లా కలెక్టర్ నుంచి అవార్డు అందుకుంటున్న త్రిమూర్తులు

కె.గంగవరం: పామర్రు పీహెచ్‌సీకి చెందిన ల్యాబ్ టెక్నీషియన్ వీవీవీ త్రిమూర్తులుకు ఉత్తమ సేవా పురస్కారం లభించింది. ప్రపంచ ఎయిడ్స్ దినం సందర్భంగా అమలాపురంలో జరిగిన కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్లా చేతులమీదుగా త్రిమూర్తులు ప్రశంసాపత్రాన్ని అందుకున్నారు. ఈ పురస్కారం అందుకోవడంపై పీహెచ్‌సీ వైద్యురాలు పార్వతి, సర్పంచ్ వాసంశెట్టి వెంకటదుర్గ, ఏఎన్‌ఎంలు, ఆశా వర్కర్లు, ఇతర వైద్య సిబ్బంది త్రిమూర్తులును అభినందించారు.

క్రికెట్ కిట్ల అందజేత



క్రీడాకారులకు క్రికెట్ కిట్‌ను అందజేస్తున్న సర్పంచ్

కాజులూరు: గ్రామాల్లో ఈ నెల 15 నుంచి నిర్వహించనున్న ఆడుదాం ఆంధ్రా క్రీడా పోటీలను యువత సద్వినియోగం చేసుకోవాలని బందనపూడి సర్పంచ్ దేగల తిరుమళ వేణి అన్నారు. పోటీల్లో పాల్గొనే క్రీడాకారులకు శుక్రవారం ఆమె క్రికెట్ కిట్లను అందజేశారు. ఆసక్తి ఉన్నవారు ఈ పోటీల్లో పాల్గొని, రాష్ట్ర స్థాయి బహుమతులు పొందాలని ఆకాంక్షించారు. వైఎస్సార్ సీపీ నాయకుడు దేగల సత్యనారాయణ పాల్గొన్నారు.

విగ్రహాల నిర్ణయం చరిత్రాత్మకం

కపిలేశ్వరపురం (మండపేట): మండపేట పట్టణ ప్రధాన రహదారిలో డా.బీఆర్ అంబేడ్కర్, బాబూ జగ్జీవన్‌రామ్ విగ్రహాలను ఏర్పాటు చేయాలని నిర్ణయించడం అభినందనీయమని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర కార్యదర్శి, సోషలిస్ట్ పార్టీ నేత ధూళి జయరాజు అన్నారు. పట్టణంలో శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ దళితుల దీర్ఘకాల ఆకాంక్షకు ఆచరణ రూపమిచ్చిన ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు, మున్సిపల్ చైర్‌పర్సన్ పతివాడ నూకదుర్గారాణి, సహకరించిన ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు, అధికార, ప్రతిపక్ష ప్రజాప్రతినిధులకు కృతజ్ఞతలు తెలిపారు.

దాడులపై కేసులు నమోదు

రాయవరం: పసలపూడిలో గురువారం రాత్రి పరస్పర దాడుల నేపథ్యంలో శుక్రవారం కేసులు నమోదు చేసినట్టు రాయవరం ఎస్సై జి.నరేష్ విలేకరులకు తెలిపారు. అంబేడ్కర్ పాత, కొత్త కమిటీల మధ్య ఏర్పడిన వివాదాల నేపథ్యంలో ఇరువర్గాల మధ్య దాడులు జరిగాయన్నారు. మెర్ల వెంకన్నబాబు ఇచ్చిన ఫిర్యాదు మేరకు 14 మందిపై కేసు నమోదు చేశామన్నారు. అలాగే కొవ్వూరు కృష్ణ ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎనిమిది మందిపై కేసు నమోదు చేయగా, పచ్చిమళ్ల విజయ్ అలియాస్ వీరేంద్ర ఇచ్చిన ఫిర్యాదుపై ముగ్గురిపై కేసు నమోదు చేసినట్టు ఎస్సై తెలిపారు. గ్రామంలో పోలీస్ పికెట్ ఏర్పాటు చేశామన్నారు. దాడిలో గాయపడి కాకినాడ జీజీహెచ్‌లో చికిత్స పొందుతున్న వారిలో ఒకరి పరిస్థితి సీరియస్‌గా ఉన్నట్టు సమాచారం వచ్చిందని తెలిపారు.

పాఠశాల తనిఖీ

కపిలేశ్వరపురం: మాచర హైస్కూల్‌ను పాఠశాల తనిఖీ అధికారి దొండపాటి జోసెఫ్ శుక్రవారం తనిఖీ చేశారు. సిలబస్ పూర్తి చేయడం, రాత పుస్తకాల ప్రగతి, వర్క్ పుస్తకాలు దిద్దడం, పరీక్షా పేపర్ల మూల్యాంకనం, ఉపాధ్యాయుల వ్యక్తిగత మార్కుల రిజిస్టరు, డైరీ, పాఠ్య ప్రణాళికలు తదితర అంశాలను పరిశీలించారు.

కమ్మేస్తున్న పొగ

- పంట భూముల్లో మంటలు పెడుతున్న రైతులు
- ఎండుగడ్డిని తగులబెట్టడం కోసమే..
- కుళ్లబెడితే ఎరువుగా మారుతుందంటున్న వ్యవసాయ నిపుణులు



వెదురుమూడి–పెదపళ్ల రహదారిపై కమ్ముకున్న పొగ

కపిలేశ్వరపురం: మాసూళ్లు ముమ్మరంగా సాగుతుండటంతో.. రైతులు ధాన్యాన్ని ఆరుదల కోసం రహదారులపై ఆరబోస్తున్నారు. మరోవైపు రబీ సాగు కోసం పొలాలను సిద్ధం చేస్తున్నారు. ఇందుకోసం పొలాల్లోని ఎండుగడ్డిని తగులబెడుతున్నారు. మంటలు ఎగబడటం, పొగ రహదారులపైకి కమ్ముకురావడం వల్ల ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. ఇది ప్రమాదాలకు దారితీస్తుందన్న ఆందోళన సర్వత్రా వ్యక్తమవుతోంది.

రైతుల బాధ్యతే కీలకం

వ్యవసాయ క్షేత్రాల్లో యంత్రాల ద్వారా కోసి వదేసిన గడ్డిని రైతులు తగులబెడుతున్నారు. గంటల తరబడి అలా తగులబడడం వల్ల దట్టమైన పొగ రహదారులను కమ్మేస్తోంది. కపిలేశ్వరపురం–మండపేట, ద్వారపూడి–మండపేట, రామచంద్రపురం–గంగవరం తదితర రహదారుల వెంబడి వ్యవసాయ క్షేత్రాల్లో గడ్డిని తగులబెట్టే పనులు ముమ్మరంగా జరుగుతున్నాయి. మంటలు తీవ్రమైన సందర్భాల్లో.. వాటిని అదుపు చేసేందుకు అగ్నిమాపక వాహనం సంఘటన స్థలానికి చేరుకోవడం కష్టతరమవుతోంది. చేను గట్టుపై ఉన్న వాహనానికి, మంటలు వ్యాపిస్తున్న ప్రదేశాలకు దూరం పెరగడం వల్ల సిబ్బందికి ప్రమాదాన్ని అదుపు చేయడానికి చాలా సమయం పడుతోంది. ఈలోగా మరో ప్రమాదం సంభవిస్తే.. సిబ్బంది నిస్సహాయులు కావాల్సి వస్తోంది. వ్యవసాయ క్షేత్రాల్లో అగ్ని ప్రమాదాలను నిలువరించడం సమస్యతో కూడుకున్నదని, రైతులు బాధ్యతగా వ్యవహరించడమే ఏకైక మార్గమని అగ్నిమాపక వర్గాలు చెబుతున్నాయి.

గత సంఘటనలే గుణపాఠాలు

కపిలేశ్వరపురం మండలం అంగర కొత్త చెరువు వద్ద నున్న వ్యవసాయ క్షేత్రంలో గతేడాది ఏప్రిల్‌లో గడ్డిని తగులబెట్టడంతో మంటలు చెలరేగి ధాన్యం రాశి దగ్ధమైంది. రాయవరం మండలం వెదురుపాకలో 2018 మే ఐదున సంభవించిన ప్రమాదంలో 12 ఎకరాల్లోని ధాన్యం రాశులు అగ్నికి ఆహుతయ్యాయి. ఇలా తరచూ వ్యవసాయ క్షేత్రాల్లోని గడ్డిని తగులబెడుతుంటంతో అగ్ని ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. మే నెలలో ఎండ వేడి ప్రభావమూ, దాళ్వా గడ్డిని పశువులకు వినియోగించకపోవడం కారణాలతో రబీ పంట ఎండుగడ్డిని రైతులు ఎక్కువగా తగులబెడుతుంటారు. ఈ ఏడాది ఖరీఫ్ పంట చేతికందగానే తుపాన్ల అలజడి నెలకొనడంతో యంత్రాలను ఆశ్రయించారు. యంత్రాల కోత గడ్డి పశువులకు అక్కరకు రాకపోవడంతో దానిని తగులబెడుతున్నారు.

ప్రత్యామ్నాయంగా వాడుకోవాలి



పొలంలోని గడ్డిని ప్రత్యామ్నాయంగా వాడుకోవాలి. కుళ్లబెట్టి దమ్ము చేస్తే ఎరువుగా మారుతుంది. పొలంలోని గడ్డిని స్వీయ పర్యవేక్షణ లేకుండా తగులబెట్టడం అపాయకరం.

– కేవీఎస్ రమేష్‌కుమార్, ఏఓ, వ్యవసాయ శాఖ, కపిలేశ్వరపురం



టేకిలో దగ్ధమవుతున్న పశువులపాకలో మంటలు ఆర్పుతున్న అగ్నిమాపక సిబ్బంది (ఫైల్)

ఒక్కటే కేంద్రం

మండపేట నియోజకవర్గ పరిధిలో మండపేటలో మాత్రమే అగ్నిమాపక కేంద్రం ఉంది. రాయవరం మండలంలోని గ్రామాలకు అనపర్తి, రామచంద్రపురం అగ్నిమాపక కేంద్రాల సిబ్బంది సేవలందిస్తారు. మండపేట కేంద్రానికి 30 కి.మీ. పరిధిని నిర్దేశించారు. మండపేట అర్బన్, కపిలేశ్వరపురం మండలంలోని 17 గ్రామాలు, మండపేట రూరల్ మండలంలోని ఇప్పనపాడు, ఆలమూరు మండలంలోని జొన్నాడ గ్రామాలున్నాయి. ప్రమాదం సంభవించిన వెంటనే సంఘటన స్థలానికి చేరుకోగలిగినప్పటికీ, వ్యవసాయ క్షేత్రంలోకి వెళ్లేందుకు అనేక సాంకేతిక సమస్యలు ఎదురవుతున్నాయి.

యాత్ర స్పెషల్‌కు విశేష స్పందన



యాత్ర స్పెషల్‌ను ప్రారంభిస్తున్న వెంకటేశ్వర్లు

రామచంద్రపురం రూరల్: రామచంద్రపురం ఆర్టీసీ డిపో నుంచి ఏర్పాటు చేసిన అష్ట సోమేశ్వరాలయాల యాత్ర స్పెషల్‌కు భక్తుల నుంచి విశేష స్పందన లభించినట్టు డిపో మేనేజర్ కొడమంచిలి వెంకటేశ్వర్లు శుక్రవారం విలేకరులకు తెలిపారు. యాత్రా స్పెషల్‌ను ఆయన జెండా ఊపి ప్రారంభించారు. కార్తిక మాసంలో ద్రాక్షారామ మాణిక్యాంబ సమేత భీమేశ్వరస్వామి ఆలయానికి అష్ట దిక్కుల్లో వెలసిన సోమేశ్వరాలయాల సందర్శనకు భక్తుల కోరిక మేరకు ఈ యాత్ర స్పెషల్ నిర్వహించినట్టు పేర్కొన్నారు. శుక్రవారం ఒక బస్సు బయలుదేరగా, శనివారం రెండు బయలుదేరుతాయని చెప్పారు. భక్తుల డిమాండ్‌కు అనుగుణంగా ఈ సరీ్వసును కొనసాగిస్తామన్నారు.

కేశవరం లారీ సంఘ అధ్యక్షుడిగా సూరిబాబు



సూరిబాబును అభినందిస్తున్న ప్రముఖులు

కపిలేశ్వరపురం (మండపేట): మండపేట మండలం కేశవరం లారీ యూనియన్ కార్యవర్గ ఎన్నిక సంఘ కార్యాలయంలో శుక్రవారం జరిగింది. సంఘ జిల్లా నాయకుల సమక్షంలో నిర్వహించిన ఈ ఎన్నికల్లో అధ్యక్షుడిగా గంధం సూరిబాబు ఎన్నికయ్యారు. ఆయనను ఎంపీపీ ఉండమట్ల శ్రీనివాస్, వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకులు కొప్పిరెడ్డి ప్రసాద్, ఉండమట్ల నారాయణ, అల్లంపల్లి కిశోర్, కూసు అబ్బు ఉండమట్ల కాపు పంతం ఏడుకొండలు, గనిశెట్టి సత్తిబాబు అభినందనలు తెలిపారు. ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు ఆశీస్సులతో సంఘ సభ్యుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని సూరిబాబు అన్నారు.

ఆధ్యాత్మిక కేంద్రంగా అర్తమూరు



అర్తమూరులో స్వామిని దర్శించుకుంటున్న ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు, పాపారాయుడు

ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు

కపిలేశ్వరపురం (మండపేట): మండపేట మండలం అర్తమూరు గ్రామం ఆధ్యాత్మిక కేంద్రంగా విరాజిల్లుతోందని ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు అన్నారు. గ్రామంలోని సీతారామచంద్ర లక్ష్మణ సమేత ఆంజనేయ స్వామి ఆలయ 26వ వార్షికోత్సవం, స్వామి కల్యాణం శుక్రవారం ఘనంగా జరిగింది. స్వామివారిని ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు దర్శించుకున్నారు. జిల్లా వికాస తరంగిణి అధ్యక్షులు కర్రి పాపారాయుడు కుమార్తె భాగ్యర్కసిన్హా, అల్లుడు రాజశేఖరరెడ్డి దంపతులతో స్వామి కల్యాణం వైభవంగా సాగింది. కర్రి పాపారాయుడు మాట్లాడుతూ త్రిదండి శ్రీమన్నారాయణ రామానుజ జీయర్ స్వామి చేతుల మీదుగా ప్రారంభించిన ఆంజనేయ స్వామి ఆలయం ప్రాధాన్యమైందన్నారు. కార్యక్రమంలో ప్రముఖులు పడాల సుబ్బారెడ్డి. సత్తి బులిస్వామి రెడ్డి, పడాల రామకృష్ణారెడ్డి, కాయల నల్లమిల్లి శ్రీహరిరెడ్డి, కె.ధర్మారెడ్డి, ఎన్.వీరెడ్డి, ఆలయ పూజారి ప్రసాద్, కల్యాణం అర్చకులు భాస్కరరావు పాల్గొన్నారు.

బడుగుల ఆశాజ్యోతి పరంజ్యోతి



వెంకటాయపాలెంలో పరంజ్యోతి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న నాయకులు

రామచంద్రపురం రూరల్: దివంగత గుర్రాల పరంజ్యోతి బడుగు, బలహీన వర్గాల ఆశాజ్యోతిగా ప్రజల గుండెల్లో నిలిచారని వక్తలు పేర్కొన్నారు. వెంకటాయపాలెంలో గుర్రాల పరంజ్యోతి స్మారక స్థూపం వద్ద ఆయన వర్ధంతి కార్యక్రమం ప్రజా సంఘాల ఆధ్వర్యంలో శుక్రవారం జరిగింది. తొలుత ఆయన చిత్రపటానికి నివాళులర్పించారు. సమాజానికి ఆయన చేసిన సేవలను కొనియాడారు.

కార్యక్రమంలో సీపీఐ ఎంఎల్(న్యూడెమోక్రసీ) జిల్లా సహాయ కార్యదర్శి చీకట్ల వెంకటేశ్వరరావు, ఏఐకేఎంఎస్ జిల్లా నాయకుడు వెంటపల్లి భీమశంకరం, పీవైఎల్ జిల్లా నాయకుడు అంబటి కృష్ణ, పరంజ్యోతి సతీమణి దయామణి, గ్రామ సర్పంచ్ యల్లమిల్లి సతీష్‌కుమారి, ద్రాక్షారామ సర్పంచ్ కొత్తపల్లి అరుణ, దళిత ఐక్య వేదిక నాయకులు వెంటపల్లి రామకృష్ణ, గుబ్బల శ్రీను, రేవు నాగేశ్వరరావు, సీహెచ్ పట్టాభి, చింతా రాజారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

జగన్‌ను మళ్లీ గెలిపించుకోవాలి

రామచంద్రపురం రూరల్: ఎన్నికల్లో ఇచ్చిన హామీలను 99 శాతం నెరవేర్చిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని ప్రజలు తిరిగి గెలిపించుకోవాలని రామచంద్రపురం మండల ఎంపీపీ అంబటి భవాని కోరారు. మండలంలోని స్వగ్రామం వేగాయమ్మపేటలో శుక్రవారం వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమం నిర్వహించారు. సర్పంచ్ అంబటి తుకారం అధ్యక్షత వహించారు. ఎంపీపీ భవాని మాట్లాడుతూ వైఎస్సార్ సీపీ పాలనలో గ్రామస్తులకు చేకూరిన సంక్షేమం, అభివృద్ధిని గణాంకాలు సహా వివరించారు. పథకాల బోర్డును ఆవిష్కరించారు. పార్టీ మండల అధ్యక్షుడు పలివెల నాగరాజు ఆధ్వర్యంలో కన్వీనర్లు, గృహసారథులు, వలంటీర్ల ఆధ్వర్యంలో పార్టీ జెండాను ఆవిష్కరించారు. ఎంపీటీసీ రెడ్నం సతీష్, ఖాదర్, ఆనుసూరి రమేష్, కొప్పుల రాజు, పిల్లి రమణ తదితరులు పాల్గొన్నారు.

ఆశాజనకంగా జగన్ పాలన

రాయవరం: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి చేపడుతున్న సంక్షేమ పాలన పేద, మధ్య తరగతి ప్రజలకు ఆశాజనకంగా ఉందని మండపేట ఏఎంసీ చైర్మన్ సిరిపురపు శ్రీనివాసరావు, ఎంపీపీ నౌడు వెంకటరమణ, గ్రామాభివృద్ధి కమిటీ చైర్మన్ తేతల సుబ్బరామారెడ్డి పేర్కొన్నారు. రాయవరంలో శుక్రవారం వై నీడ్స్ ఏపీ జగన్ కార్యక్రమం సర్పంచ్ చంద్రమళ్ల రామకృష్ణ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ పథకాలను ఇతర రాష్ట్రాలు అనుసరిస్తున్నాయన్నారు. సంక్షేమ సారథికి తిరిగి పట్టం కట్టాల్సిన అవసరం ప్రతిఒక్కరిపై ఉందన్నారు. ఈ సందర్భంగా పథకాల బోర్డును, పార్టీ పతాకాన్ని ఆవిష్కరించారు. కార్యక్రమంలో మండల సచివాలయ కన్వీనర్ తమలంపూడి సత్యనారాయణరెడ్డి, మండల బూత్ కమిటీ కన్వీనర్ చింతా సుబ్బారెడ్డి, పార్టీ నేతలు నల్లమిల్లి వెంకటరెడ్డి, పడాల కమలారెడ్డి, కొల్లి రాంబాబు తదితరులు పాల్గొన్నారు.



వేగాయమ్మపేటలో పథకాల బోర్డును ఆవిష్కరిస్తున్న ప్రజాప్రతినిధులు

సీఎం జగన్‌తోనే రాష్ట్రాభివృద్ధి

కపిలేశ్వరపుం (మండపేట): సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యమవుతుందని ప్రజాప్రతినిధులు పేర్కొన్నారు. మండపేట మండలం తాపేశ్వరం సచివాలయం–2 పరిధిలో శుక్రవారం వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమం జరిగింది. జెడ్పీటీసీ కురుపూడి భవాని, ఎంపీటీసీ పంపన లక్ష్మి, వైఎస్సార్ సీపీ నాయకులు నాగిరెడ్డి, గ్రంధి సూరిపండు మాట్లాడుతూ గ్రామంలో చేపట్టిన సంక్షేమాన్ని వివరించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ ఐదం రాజు, బందెల సాయిరామ్, బూర అమ్ములు, కడియాల నాగేంద్ర ప్రసాద్, మేడిశెట్టి వీరేంద్ర, గుడాల సత్తిబాబు, నాగిరెడ్డి శివ, కాండ్రేగుల రాంబాబు, వార్డు మెంబర్లు పాల్గొన్నారు.



రాయవరంలో పథకాల బోర్డును ఆవిష్కరిస్తున్న ప్రజాప్రతినిధులు



తాపేశ్వరంలో పథకాల బోర్డును ఆవిష్కరిస్తున్న నాయకులు

దాళ్వాకు సమాయత్తం కావాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఏఓ రవి

కె.గంగవరం: తొలకరి పంట పనులు పూర్తి చేసుకున్న రైతులు వెంటనే దాళ్వా పంటకు సమాయత్తం కావాలని వ్యవసాయ శాఖాధికారి బలుసు రవి సూచించారు. మండలంలోని పాణింగపల్లి ఆర్బీకే వద్ద శుక్రవారం వ్యవసాయ సలహా మండలి సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ డిసెంబర్ 31లోపు దాళ్వాకు వెదజల్లు, నాట్ల ద్వారా పనులు పూర్తి చేయాలని సూచించారు. దాళ్వా కోసం సాగునీటిని అన్ని కాలువల్లో విడుదల చేసినట్టు పేర్కొన్నారు. మెరక భూములు, తొలకరి సాగులోనే సాగునీటి ఇబ్బంది ఉన్న రైతులు ప్రత్యామ్నాయ పంటలైన అపరాలు, పచ్చిరొట్ట వేసుకోవాలని తెలిపారు. తొలకరికి రెండు రోజుల పాటు వర్షాలు పడే అవకాశం ఉందని, రైతులు అప్రమత్తంగా ఉండాలని తెలిపారు. సర్పంచ్ చీకట్ల సునీతగోపాలం, సొసైటీ అధ్యక్షులు వైట్ల అచ్యుత రామప్రసాద్, వైస్ ఎంపీపీ నీతిపూడి మధుబాల, గ్రామ వ్యవసాయ సహాయకులు బండారు శ్రీరాములు తదితరులు పాల్గొన్నారు.

శాంతి స్థాపనలో బ్రహ్మకుమారీల పాత్ర కీలకం



ఎమ్మెల్సీ త్రిమూర్తులును సత్కరిస్తున్న బ్రహ్మకుమారీలు

రాయవరం: సమాజ శాంతి స్థాపనలో బ్రహ్మకుమారీల పాత్ర కీలకమని ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు పేర్కొన్నారు. మండలంలోని పసలపూడిలో శుక్రవారం ఓంశాంతి ఆశ్రమంలో రాధాకృష్ణ మ్యూజియంను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ త్రిమూర్తులు మాట్లాడుతూ నిత్యం ఒత్తిడితో కూడిన జీవితానికి ధ్యానం అవసరమన్నారు. ఆరోగ్యవంతమైన సమాజానికి బ్రహ్మకుమారీలు చేస్తున్న కృషిని అభినందించారు. బ్రహ్మకుమారి మాధవి మాట్లాడుతూ అనేక శారీరక, మానసిక రుగ్మతల నిర్మూలనకు మెడిటేషన్ ఆయుధంగా పనిచేస్తుందన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ త్రిమూర్తులను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో పారిశ్రామికవేత్త చింతా వెంకటరెడ్డి, సొసైటీ మాజీ అధ్యక్షుడు నల్లమిల్లి వెంకటరెడ్డి, వైఎస్సార్ సీపీ గ్రామ అధ్యక్షుడు చింతా సుబ్బారెడ్డి, నేతలు ద్వారంపూడి రామచంద్రారెడ్డి, చిన వెంకటసత్యనారాయణరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రెండు రోజుల ఓటరు ప్రత్యేక డ్రైవ్



సుధాసాగర్, ఆర్డీవో

రామచంద్రపురం: రామచంద్రపురం అసెంబ్లీ నియోజకవర్గంలో శని, ఆదివారాలు ఓటరు ప్రత్యేక డ్రైవ్ నిర్వహిస్తున్నట్టు ఓటరు నమోదు అధికారి, ఆర్డీవో ఎస్ సుధాసాగర్ తెలిపారు. ఆర్డీవో కార్యాలయంలో శుక్రవారం విలేకరులతో మాట్లాడుతూ అన్ని పోలింగ్ స్టేషన్ల వద్ద బూత్ లెవెల్ అధికారులు ఉదయం 10 నుంచి సాయంత్రం 5 వరకు ప్రజలకు అందుబాటులో ఉంటారని తెలిపారు. ఓటర్లంతా తమ ఓట్లను పరిశీలించుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఓట్ల సవరణ, నమోదు తదితర అంశాల ఫారాలను వివరించారు. పూర్తి చేసిన ఫారాలకు అవసరమైన పత్రాలు జత చేసి బూత్ లెవెల్ అధికారులకు అందజేయాలన్నారు.

నేటి నుంచి ఓటు నమోదు ప్రత్యేక శిబిరాలు

కపిలేశ్వరపురం: ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు శని, ఆదివారాల్లో ప్రత్యేక ఓటు నమోదు శిబిరాలను నిర్వహించనున్నట్టు మండపేట, కపిలేశ్వరపురం రెవెన్యూ అధికారులు తెలిపారు. నిర్దేశిత పోలింగ్ కేంద్రాల్లో బీఎల్‌ఓలు ఉదయం 10 నుంచి సాయంత్రం 5 వరకూ అందుబాటులో ఉంటారన్నారు. ఓటుకు సంబంధించిన దరఖాస్తులను స్వీకరిస్తారని కపిలేశ్వరపురం తహసీల్దార్ కొమరం సూర్యారావు తెలిపారు. కొత్త ఓటు నమోదు కోసం ఫారం–6, ఓటు తొలగింపు, మరణించిన, రెండు ఓట్లు నమోదైన, శాశ్వత బదిలీ నేపథ్యంలో ఓటు తొలగింపు కోసం ఫారం–7, ఓటు బదిలీ, వివరాల సవరణ కోసం ఫారం–8 అందజేయాలని చెప్పారు.

హెచ్‌ఐవీపై అవగాహన అవసరం

రామచంద్రపురం: హెచ్‌ఐవీపై ప్రతిఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని, హెచ్‌ఐవీ బాధితులకు ఆత్మస్థైర్యాన్ని కలిగించాలని ఏరియా ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ బి వీరభద్రుడు అన్నారు. ప్రపంచ ఎయిడ్స్ దినం సందర్భంగా ఆస్పత్రి రామచంద్రపురం ఐసీటీసీ ఆధ్వర్యంలో డాక్టర్ వీరభద్రుడు ఆధ్వర్యంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ముఖ్యఅతిథులుగా మున్సిపల్ చైర్‌పర్సన్ గాధంశెట్టి శ్రీదేవి, రాష్ట్ర మంత్రి చెల్లుబోయిన శ్రీనివాస్ వేణుగోపాలకృష్ణ తనయుడు చెల్లుబోయిన నరేన్, ఆస్పత్రి అభివృద్ధి కమిటీ డైరెక్టర్ తొగరు మూర్తి ర్యాలీని ప్రారంభించారు. కార్యక్రమంలో డాక్టర్ ప్రవీణ్, డాక్టర్ చక్రధర్, ఐసీటీసీ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ సుశీల, ఆస్పత్రి ఎల్‌డీసీ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

వ్యాధి నివారణకు..

కపిలేశ్వరపురం: ఎయిడ్స్ వ్యాధిపై ప్రతిఒక్కరికీ అవగాహన అవసరమని అంగర, వాకతిప్ప, అచ్యుతాపురం పీహెచ్‌సీల వైద్యాధికారులు పి.రత్నకుమారి, పి.చంద్రమౌళి, కరుణేంద్రకుమారి అన్నారు. ప్రపంచ ఎయిడ్స్ వ్యాధి నివారణ దినం సందర్భంగా ఆయా పీహెచ్‌సీల పరిధిలోని గ్రామాల్లో శుక్రవారం అవగాహన ర్యాలీలు నిర్వహించారు. కార్యక్రమంలో ఆయా పీహెచ్‌సీల వైద్యులు, అంగర పీహెచ్‌సీ ఎంపీహెచ్‌ఈఓ జిత్తుక మల్లికార్జునుడు, హెచ్‌ఈ బి.రామారావు తదితరులు పాల్గొన్నారు.



ర్యాలీని ప్రారంభిస్తున్న చైర్‌పర్సన్ శ్రీదేవి, నరేన్, మూర్తి

ఎయిడ్స్ నియంత్రణకు కృషి చేయాలి

కాజులూరు: మానవాళి మనుగడకు పెనుభూతంగా మారిన ఎయిడ్స్ మహమ్మారిని నియంత్రించాల్సిన బాధ్యత ప్రతిఒక్కరిపై ఉందని తాళ్లరేవుకు చెందిన బీమాబాయి మహిళా మండలి డాక్యుమెంటేషన్ పోగ్రాం కోఆర్డినేటర్ పీఎస్ఆర్ కనకాంబరం అన్నారు. శుక్రవారం ప్రపంచ ఎయిడ్స్ నివారణ దినంలో భాగంగా పలు గ్రామాల్లో అవగాహన ర్యాలీలు నిర్వహించారు. గొల్లపాలెంలో పీఎస్ఎన్ మూర్తి కళాశాలలో సభ జరిగింది. మహిళా మండలి ఆర్గనైజర్లు అనితాకుమారి, లోవకుమారి, కళాశాల చైర్మన్ ఆనందరాయుడు తదితరులు పాల్గొన్నారు.

ఎయిడ్స్‌ను తరిమేద్దాం..

కె.గంగవరం: ప్రపంచ ఎయిడ్స్ దినం సందర్భంగా పలు ప్రభుత్వాస్పత్రులు, స్వచ్ఛంద సంస్థల ఆధ్వర్యంలో శుక్రవారం అవగాహన ర్యాలీలు జరిగాయి. సమాజం నుంచి ఎయిడ్స్‌ను తరిమేయాలని ప్రతిజ్ఞ చేశారు. ముఖ్యఅతిథిగా పీఎంపీ జిల్లా అధ్యక్షుడు కేఎస్ఎన్ బాబు పాల్గొన్నారు. పామర్రు, కుందూరు, పేకేరు, దంగేరు పీహెచ్‌సీ ఆధ్వర్యంలో సిబ్బంది అవగాహన ర్యాలీలు నిర్వహించారు.



మండపేటలో ప్రతిజ్ఞ చేస్తున్న ప్రజాప్రతినిధులు, వైద్యులు, సిబ్బంది

అవగాహనతో వ్యాధి ప్రభావం నిర్వీర్యం

కపిలేశ్వరపురం (మండపేట): మహమ్మారి హెచ్‌ఐవీపై అవగాహన కలిగి ఉండటం ద్వారా వ్యాధి ప్రభావాన్ని నిర్వీర్యం చేయవచ్చని ప్రపంచ ఎయిడ్స్ దినం సందర్భంగా నిర్వహించిన అవగాహన ర్యాలీ కార్యక్రమంలో వక్తలన్నారు. స్థానిక ప్రభుత్వ ఆస్పత్రి ఈఎఈ సూపరింటెండెంట్ ఆధ్వర్యంలో ఐసీటీసీ కౌన్సిలర్ డి.నాగలక్ష్మి పర్యవేక్షణలో కార్యక్రమం జరిగింది. మున్సిపల్ వైస్ చైర్మన్ వేగుళ్ల నారయ్యబాబు, ఆస్పత్రి అభివృద్ధి కమిటీ సభ్యులు యరమాటి వెంకట్రాజు ర్యాలీలో పాల్గొన్నారు. కలువపువ్వు సెంటర్లో మానవహారం నిర్వహించారు. వైద్యులు భావన, సతీష్, ప్రసన్న, హెడ్ నర్స్ మాధురి, పీఎంపీ సంఘ సభ్యులు కోన సత్యనారాయణ, వానపల్లి కనకరాజు, గాలింకి నాగేశ్వరరావు, ముంగర వెంకట్రాజు, జేసీయస్ ఇన్‌చార్జి యరమాటి వెంకన్నబాబు పాల్గొన్నారు.

హెచ్‌ఐవీపై అవగాహన ర్యాలీ

రామచంద్రపురం రూరల్: ప్రపంచ ఎయిడ్స్ దినం సందర్భంగా ద్రాక్షారామ, వెల్ల పీహెచ్‌సీల వైద్యాధికారులు డాక్టర్ ప్రశాంతి, డాక్టర్ మమతల ఆధ్వర్యంలో వైద్యులు, సిబ్బంది శుక్రవారం ఆయా గ్రామాల్లో అవగాహన ర్యాలీలు నిర్వహించారు. ఎయిడ్స్ బారిన పడకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలు, హెచ్‌ఐవీ బాధితులు పాటించాల్సిన విధులపై అవగాహన కల్పించారు.